6న నేత్ర, అవయవ, శరీర దాతలతో సమావేశం

మన్సూరాబాద్: నేత్ర, అవయవ, శరీరదానంపై ప్రజల్లో అవగహన కల్పించటానికి ఎల్‌బీనగర్ సూర్యోదయనగర్ కాలనీలోని జైభారత్ కేంద్ర కార్యాలయం ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ భవన్‌లో ఆదివారం ఉదయం సమావేశం నిర్వహిస్తున్నట్లు జైభారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసీ రజనీ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తలుగా జైభారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఖదిజ్ఞాసీ యోధ రమణమూర్తి, జాయింట్ యాక్షన్ కమిటీ ఫర్ ఐ, ఆర్గాన్, బాడీ డోనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ కన్వీనర్ గంజి ఈశ్వర్‌లింగం హాజరవుతునున్నట్లు తెలిపారు. అనంతరం నేత్ర, అవయవ, శరీర దానం చేసిన వ్యక్తుల కుటుంబాలను సన్మానిస్తున్నట్లు వెల్లడించారు.

రైతు బజార్‌లో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారుల్లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాట 75, వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 18–28, కాకర 45, బీర 50, క్యాబేజి 21, ఫ్రెంచి బీన్స్ 95, క్యారెట్ 43, దొండ 45–52, చిక్కుడు 28–50, గోకర 35, బీట్‌రూట్ 25, క్యాప్సికం 70, ఆలు 38, దోస 23, సొర 15, పొట్ల 18, ఉల్లిగడ్డ 34, చామగడ్డ 35.

సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



సంబరాల్లో సాయి చైతన్య కాలేజీ విద్యార్థులు, ప్రిన్సిపాల్ సురేశ్ బాబు

మలక్‌పేట: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ ఉత్సవాలు నిలుస్తాయని సాయి చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్ బాబు పేర్కొన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని కళాశాల ప్రాంగణంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలలో బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న మధుర ఉపేందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఆలయాలు, పార్కుల వద్ద పనిచేసే సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులకు కాంగ్రెస్ నాయకుడు మధుర ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యేటా మాదిరిగానే ఈయేడు కూడ కార్మికులకు చేయూతను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే

చాదర్‌ఘాట్: వాహెద్‌నగర్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే శుక్రవారం ప్రారంభించినట్లు సర్కిల్–6 డీసీ జయంత్ తెలిపారు. రిపోర్టును ఈనెల 8 లోగా పూర్తి చేసి ప్రభుత్వానికి అందిస్తామని పేర్కొన్నారు. ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎంసీలు, డీపీఓలు, తదితరులు ఇంటింటికి తిరుగుతూ కుటుంబాల సభ్యుల వివరాలు సేకరించాలన్నారు. ఒక్కో టీమ్ ప్రతిరోజు కనీసం 40 ఇళ్లను సర్వే చేయాలని సూచించారు. పుట్టిన, మరణించిన వారి వివరాలు, కొత్త ఫ్యామిలీ, మైగ్రేషన్, పర్మినెంట్‌గా విదేశాలకు వెళ్లిన వారి వివరాలు సేకరించి నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రాజెక్ట్‌తో కుటుంబాన్ని యూనిట్‌గా గుర్తించి ఐడీ కార్డు ఇస్తారని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదల ఆరోగ్యానికి రక్ష



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో దోహద పడుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని పలువురు ఆసుపత్రిలో చికిత్స పొందిన తర్వాత తమను ఆర్థికంగా ఆదుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. దీంతో వారి ఆసుపత్రి బిల్లులతో సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తు చేయించారు. సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చెక్కులను అందజేశారు. పేదలకు నాణ్యమైన, ఆధునాతన వైద్య సేవాలు పొందేందుకు సీఎం సహాయనిధి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సదానంద్ రెడ్డి, జగదీశ్‌యాదవ్, భైర శంకర్, పండాల రాజశేఖర్ పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు స్థలాల పరిశీలన

మన్సూరాబాద్: డివిజన్ పరిధి చంద్రపురికాలనీ, మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్‌కు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. సుమారు రూ.31.05లక్షల వ్యయంతో చేపట్టనున్న జిమ్ పరికరాలను మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంతో పాటు చంద్రపురికాలనీలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కాలనీవాసులు మహిళలు సైతం వ్యాయమాలు చేసుకోవటానికి అనువుగా ఓపెన్‌జిమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఏఈ స్వప్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, నాయకులు పాల్గొన్నారు.

మంత్రి సిఫారసు చేసినా స్పందన కరువు



చాదర్‌ఘాట్: 'దేవుడు వరమిచ్చినా..పూజారి కరుణించలేదు' అన్న చందంగా మారింది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఆంగోల్ ప్రేమ్‌సాగర్ దివ్యాంగుడి పరిస్థితి. నిరుద్యోగి అయిన ఇతను రాష్ట్ర మంత్రి సీతక్కను కలిసి తన పరిస్థితిని వివరించగా వెంటనే ఆమె స్పందించి (ఔట్‌సోర్సింగ్) ఉద్యోగం ఇవ్వాలని సంబంధిత శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి అరుణను ఆదేశించింది. దీంతో ప్రిన్సిపల్ సెక్రటరీ సంబంధిత దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ డైరెక్టర్‌కు ఆర్డర్ ఇచ్చింది. ప్రేమ్‌సాగర్ ఆర్డర్ కాపీని తీసుకుని కార్యాలయానికి రాగా అధికారులు స్పందించడం లేదని నిరుద్యోగి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నాడు.

జయ మంగళం.. నిత్య శుభ మంగళం

వైభవంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు



ఎన్జీవోస్‌కాలనీ ఎల్లమ్మదేవి ఆలయంలో పూజల్లో భక్తులు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఎల్‌బీనగర్/మలక్‌పేట జోన్ పరిధిలో వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం రెండు నియోజకవర్గాల పరిధిలోని అమ్మవారి ఆలయాలు, దేవాలయల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉపవాసంలో ఉండే భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవారిని పూజిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవార్లను వివిధ రూపాల్లో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయాలు, మండపాల పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

– ఎల్‌బీనగర్/మలక్‌పేట జోన్ బృందం



బీఎన్‌రెడ్డినగర్‌లోని డీపీఎస్ స్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



బ్రహ్మచారిణి అలంకరణలో పోచమ్మతల్లి



గాయత్రీదేవి అలంకరణలో సాయినగర్‌కాలనీ దుర్గాదేవి



బాలాత్రిపుర సుందరిగా విజయదుర్గా అమ్మవారు



శ్రీగాయత్రీ దేవిగా జయదుర్గా మాతా



మలక్‌పేట హరిహర క్షేత్రంలో..



భూపేశ్‌గుప్తానగర్‌లోని అమ్మవారి మండపంలో పూజలు చేస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ మేయర్



మూసారంబాగ్ రాజరాజేశ్వరి ఆలయంలో పూజల్లో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, కమిటీ సభ్యులు

శ్రీ ప్రత్యంగిరాదేవి ఆలయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి పూజలు



శ్రీ ప్రత్యంగిరా దేవి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళ పీఠం వారాహీ సమేత శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రులు ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈమేరకు శుక్రవారం అమ్మవారిని శ్రీ గాయత్రీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి 18 రకాల విశేష అభిషేకం, అనంతరం అర్చనలు, హోమం నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉపేందర్ రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్, ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్, విఠల్ శర్మ, సువర్ణలత, హేమంత్, అరుణ పాల్గొన్నారు.

మురుగునీటి రహితంగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న మలక్‌పేట జలమండలి డీజీఎం నాగరాజు

చాదర్‌ఘాట్: మురుగునీటి రహిత నగరంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ ఆకాంక్షకు అనుగుణంగా జలమండలి సిబ్బంది, ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేయాలని జలమండలి డీజీఎం నాగరాజు అన్నారు. మలక్‌పేట డివిజన్–1లోని 4 సెక్షన్లకు చెందిన మేనేజర్లు, సూపర్‌వైజర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగునీటి నిర్వహణ భద్రతపై అవగాహనతో పాటు ప్రభుత్వం అక్టోబర్ 2 నుంచి చేపట్టిన ఓవర్‌ఫ్లో ఫ్రీ సిటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మ్యాన్‌హోళ్లను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రతి మురుగునీటి కాలువను శుభ్రం చేయాలని ఒక్కో బస్తీ పరిధి, కాలనీలో, ప్రధాన రహదారుల్లో, ఎన్ని మీటర్ల మేర కాలువలు ఉన్నాయి, వాటి విస్తీర్ణం, ఎక్కడెక్కడ డ్యామేజీలు ఉన్నాయో, వ్యర్థాలు ఎక్కువగా ఎక్కడ ఉంటునానయో గుర్తించి సర్వే చేయాలన్నారు. ఎయిర్‌టెక్ మిషన్ ఓనర్లు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మేనేజర్లు సైతం ఈనెల 2 నుంచి 90 రోజుల పాటు ఏ రోజు ఏ బస్తీలో పని చేయాలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మ్యాన్‌హోళ్ల లైన్లు మరమ్మతులు చేసే సమయంలో సూచికబోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడైనా దీర్ఘకాలిక సమస్యలు ఉంటే మరమ్మతులతో పనులు జరగకపోతే సంబంధిత మేనేజర్లు ప్రణాళిక రూపొందించి పంపిస్తే నిధులు మంజూరు చేయించి పనులు చేయిస్తానని సూచించారు.

మూసీ నిర్వాసితులకు పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాల కోసం వచ్చిన జనం

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ పరిధిలోని మూసీ పరీవాహక నిర్వాసితులకు శుక్రవారం పట్టాలు పంపిణీ చేశారు. శాలివాహననగర్ అజేయ్‌హట్స్ నిర్వాసితులు 18 మందికి, సాయిలు హట్స్‌కు చెందిన 13 మందికి పొజిషన్ సర్టిఫికెట్స్ ఇవ్వగా వారికి తమ నివాసాలు ఖాళీ చేసి జియాగూడ డబుల్ బెడ్రూంల సముదాయానికి వెళ్లినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సాయిలు హట్స్‌లో మొదట మార్కింగ్ చేసిన నివాసాలు కాకుండా మరికొన్ని కొత్తగా వేసిన గుడిసెలకు మార్కింగ్ చేశారని దీనిపై స్థానికులు అధికారులను ప్రశ్నించారు. దీంతో అక్కడ గందగోళ పరిస్థితి ఏర్పడింది. కూల్చివేయడానికి మార్కింగ్ చేశామని అధికారులు పేర్కొనగా.. స్థానిక నాయకులు డబ్బులు తీసుకుని డబుల్ బెడ్రూం ఇప్పిస్తామని ఆర్‌బీఎక్స్ మార్కింగ్ చేయించారని వారు అధికారులతో వాగ్వాదానికి దిగారు. మలక్‌పేట పోలీసులు వారికి నచ్చజెప్పి అక్కడ నుంచి పంపించారు.

పెళ్లి చేసుకుంటానని మోసం.. వ్యక్తిపై కేసు నమోదు

నాగోలు: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి ఓ యువతిని నమ్మించి పలు మార్లు లైంగిక దాడికి పాల్పడిన బౌన్సర్‌పై కేసు నమోదు అయిన సంఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2022లో ఓ యువతి నాగోలులో ఓ హోటల్ సీనియర్ కెప్టెన్‌గా పనిచేస్తుంది. మల్కాజిగిరి, అల్వాల్‌కు చెందిన ఎం. సాయికుమార్(26) యువతి పనిచేసే హోటల్‌లో బౌన్సర్‌గా పనిచేసేవాడు. సాయికుమార్ యువతి ప్రేమిస్తున్నానని చెప్పడంతో కొన్నాళ్లకు ఆమె ఒప్పుకుంది. ఆ తర్వాత నిందితుడు పలు మార్లు యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. 2024 ఏప్రిల్‌లో ఆమెతో నిశ్చితార్థం చేసుకున్నాడు. ఆ తర్వాత నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. యువతిని పెళ్లి చేసుకోనని చెప్పడంతో యువతి గురువారం రాత్రి ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధికి కృషి



సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని బస్తీల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి తెలిపారు. సింగరేణి కాలనీ గుడిసెల ప్రాంతంలో మూడు బోర్‌వెల్స్ ఏర్పాటు పనులను శుక్రవారం కార్పొరేటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, బస్తీవాసులు రవి, మాతు, ధర్మి, భీమ్లా, నరసింహ, గోపాల్, బాలు, దేవ్, దశరథ్ పాల్గొన్నారు.

నక్షత్ర హాస్పిటల్స్‌లో ఐవీఎఫ్ సేవలు షురూ



ఐవీఎఫ్ సెంటర్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న డాక్టర్లు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని నక్షత హాస్పిటల్స్ అవని ఇన్‌ఫర్టిలిటీ సెంటర్ సౌజన్యంతో ఉచిత ఐవీఎఫ్ వెద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని డాక్టర్లు హేమ, కావ్య తెలిపారు. ఆస్పత్రిలో శుక్రవారం అవని ఇన్‌ఫర్టిలిటీ సెంటర్ సౌజన్యంతో ఐవీఎఫ్ సేవలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ప్రారంభం సందర్భంగా 50 మందికిపైగా జంటలకు ఉచితంగా ఫర్టిలిటీ సేవలు, రక్త పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. దసరా సందర్భంగా వారం పాటు ప్రతిరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఇన్‌ఫర్టిలిటీ ఉచిత కన్సల్టేషన్ అందుబాటులో ఉంటుందని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గైనకాలజిస్టులు అర్చన రెడ్డి, టీ శిరీష, నిరోషా, నాగోల్ రోటరీ చాప్టర్ ప్రెసిడెంట్ సుమన్ సైని పాల్గొన్నారు.

కాకా జయంతి వాడవాడలా నిర్వహించాలి

తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య



మాట్లాడుతున్న తెలంగాణ మాల సంఘాల జేఏసీ నాయకులు

చైతన్యపురి: కార్మిక పక్షపాతి, దేశంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం బాబా సాహెబ్ మార్గంలో పోరాడిన మహానేత కేంద్ర కార్మిక శాఖ మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి (కాక) 95వ జయంతి వేడుకలను తెలంగాణ వ్యాప్తంగా వాడవాడలా ఘనంగా నిర్వహించాలని తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య, వర్కింగ్ ప్రసిడెంట్ బేర బాలకిషన్ కోరారు. దిల్‌సుఖ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మహానగరంలో వేలాది మది పేదలకు గుడిసెలు ఇప్పించిన ఘనత ఆయనదేనని అన్నారు. తెంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి,మలి దశ ఉద్యమాల్లో పోరాడారన్నారు.తెలంగాణ రాష్ట్రం ఇవ్వాలని సోనియా గాంధీని ఒప్పించిన రాజకీయ దురంధరుడు వెంకటస్వామి అని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా మండల కేంద్రాలలో జయంతి వేడుకలను జరపాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా హైదరాబాద్ సాగర్ పార్క్ వద్ద ఉన్న కాక విగ్రహం వద్ద, తదుపరి రవీంద్రభారతిలో ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమంలో అభిమానులంతా హాజరై కాకాకు నివాళులర్పించాలని కోరారు.

ఫేస్ రికగ్నైజేషన్ స్కాన్ తప్పనిసరి



చాదర్‌ఘాట్: శానిటేషన్ సిబ్బందికి ఫేస్ రికగ్నైజేషన్ స్కాన్ తప్పనిసరి అని మలక్‌పేట సర్కిల్–6 డాక్టర్ పి.అనురాధ అన్నారు. ఓల్డ్‌మలక్‌పేట డీసీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు ప్రతిఒక్కరూ ఏఎంహెచ్‌ఓ టు స్వీపర్ వరకు కచ్చితంగా ఎఫ్‌ఆర్‌ఎస్ జరిగిన తర్వాతే ఫీల్డ్ మీదకు వెళ్లాలన్నారు. సర్కిల్–6లో దాదాపు 723 మంది స్వీపర్స్, 38 ఎస్ఎఫ్ఏ (శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్), శానిటరీ సూపర్‌వైజరు పని చేస్తున్నారని తెలిపారు. ఎఫ్‌ఆర్‌ఎస్‌తో అక్రమాలకు చెక్ పెట్టినట్లు అయ్యిందని, 5 నిమిషాలు లేట్ అయినా ఆరోజు ఆబ్సెంట్ పడుతుందని తెలిపారు.